

మెరుగైన పారిశుధ్య నిర్వహణకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు : క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా నగర పాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా నిర్వహి స్తున్న డోర్ టు డోర్ చెత్త సేకరణలో తడి, పొడి చెత్తను విడివిడిగా అందించి మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. స్థానిక 39, 40వ డివిజన్లలోని మూలాపేట, మెక్లెన్స్ రోడ్, పుట్టా లే అవుట్, సాయి నగర్ శానిటేషన్ మస్టర్ పాయింట్లను కమిషనర్ మంగళవారం ఉదయం 6.30 గంటలకు తనిఖీ చేశారు. డివిజన్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి శానిటేషన్ సిబ్బంది హాజరును కమిషనర్ పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రజలతో కమిషనర్ ప్రత్యక్షంగా మాట్లాడుతూ చెత్త సేకరణ యూజర్ చార్జీలను ప్రతిఒక్కరూ బాధ్యతగా చెల్లించాలని కోరారు. తడి, పొడి చెత్తను విడివిడిగా చెత్త సేకరణ వాహనాలకు అందించాలని సూచించారు. నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, సూపర్వైజర్లు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

నిప్పుల కొలిమి..!

◆భారీగా పెరిగిన ఉష్ణోగ్రతలు

◆ఉక్కపోత...జనం విలవిల

◆మండుటెండలో గడప గడపకు

జిల్లాలో భారీగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. మూడ్రోజుల నుంచి నిప్పుల కొలిమిని తలపిస్తుంది. పెరిగిన ఉష్ణోగ్రతలతో జనం విలవిల్లాడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎండ ప్రభావం కనిపించి, తరువాత సెగలతో నగర,గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మరో రెండురోజులు ఉష్ణోగ్రతలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మండుటెండల్లో పనిచేసే కూలీలు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అనంతసాగరంలో 'ఉపాధి' పనుల్లో నిమగ్నమైన కూలీలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కొద్ది రోజులుగా అకాల వర్షాలు, ఈదురుగాలులతో ఇబ్బందులుపడుతుండగా, రెండు రోజులుగా భారీ ఉష్ణోగ్రతలను చూస్తుంది. రెండు రోజుల నుంచి జనం నానా ఇబ్బందులు పడుతున్నారు. రోజు వారి కూలీల పరిస్థితి గణనీయంగా ఉంది. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎండల తీవ్రత కనిపించింది. గ్రామీణ, నగర ప్రాంతాల్లోనూ తీవ్ర ఉష్ణోగ్రతలు నమోద య్యాయి. మధ్యాహ్నం ఎండలకు వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. రెక్కాడితే కాని డొక్కాడని పేద కూలీలు నిర్మాణ రంగంతోపాటు, ఆటో, తోపుడు బండ్లు, ఒక్కటేమిటి అన్ని రంగాల కార్మికులు అవస్థలు పడ్డారు. ఉదయం 11 గంటలకు నగర వాసులు ఇళ్లకే పరిమితమయ్యారు. బయట నుంచి వచ్చిన ప్రజలు ఏసి సినిమా, ఐస్‌క్రీమ్‌సెంటర్లు, హోటళ్లల్లో సేదతీరారు. దినసరి కూలీలు సైతం మండే ఎండలకు హడలిపోయారు. ఉపాధి హామీ కూలీలు గ్రామీణ ప్రాంతాల్లో పనులు చేశారు. ప్రభుత్వం ఆదేశించిన స్థాయిలో వసతులు కనిపించలేదు. మజ్జిగ, మంచినీరు వంటి సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ అనేక చోట్ల అమలుకు నోచుకోలేదు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రేకులు ఇళ్లలోని జనం గగ్గోలు పెట్టారు. ఉక్కపోతతో విలవిల్లాడారు. కొండాపురం మండలంలో అత్యధికంగా 46.4 శాతం, కలిగిరిలో 45. శాతంతోపాటు జిల్లా వ్యాపితంగా 42 నుంచి 46 శాతం వరకు వివిధ మండలాల్లో ఉష్ణోగ్రతలు కనిపించాయి. మరో రెండు, మూడ్రోజులు భారీగాఉష్ణోగ్రతలతోపాటు, వడగాల్పులు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.ఎండలకు వడదెబ్బ తగిలే అవకాశం ఉందని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది.

మండుటెండల్లో కూలీలు..!

ఉపాధిహామీ కూలీలు, ఇతర కూలి పనులు చేసే వారు ఎండల్లో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మంచినీరు, మజ్జిగ లాంటివి ఎక్కువగా తీసుకోవాల్సి ఉంది.ఎండలు తీవ్రరూపం దాల్చిన సమయంలో కాకుండా ఉదయం పనులు చేసేలా చూడాలని డిమాండ్ చేశారు. ఒక వేళ వడదెబ్బ, జ్వరం వంటివి పరిస్థితులు ఏర్పడితే ప్రభుత్వం వారికి వైద్యమందించాల్సి ఉంది.

వలేటివారిపాలెం మండంలో మండుటెండలో పనుల్లో నిమగ్నమైన కూలీలు

కూలీలు పనిచేసే ప్రదేశంలో వసతులు కల్పించాలి

వ్య.కా.స.జిల్లా కార్యదర్శి మంగళి పుల్లయ్య

పని ప్రదేశంలో టెంటు వేయాలి. ఎండా కాలంలో మజ్జిగ, మంచినీరు ఇవ్వాలి. మెడికల్ కిట్ పెట్టాలి. వీటితో పాటు మార్చి నుంచి జూన్ వరకూ సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలి. పనిచేసే కూలీతో పాటు40శాతం అధనంగా నగదు ఇవ్వాలి. పారకు, గడ్డపారకు, తట్టకు డబ్బులు ఇచ్చేవారు. పని ప్రదేశం దూరమైతే ఆటోఛార్జీలు ఇచ్చేవారు. ఇప్పుడు అవన్నీ తొలగించారు. ప్లే సిప్పులు ఇవ్వాలి. అది ఇవ్వడంలేదు. మస్టర్ సిస్టమ్‌కూడా మార్చేశారు. కొత్త సిస్టమ్ ద్వారా కూలీలకు ఇబ్బందులు జరుగుతున్నాయి. రెండు పూటలు పనిచేయాలని, పని చేసిన ప్రదేశంలో ఫొటోలు తీయాలని నిబంధనలు పెట్టారు. దేశమొత్తం ఉపాధిహామీ సక్రమంగా జరగాలంటే రూ.2.40లక్షల కోట్లు అవసరం. ఈఏడాది కేవలం రూ.68వేల కోట్లు మాత్రమే కేటాయించారు. అందులో రూ.40వేల కోట్లు కూలీల బకాయిలు ఉన్నాయి. కేంద్రం బడ్జెట్‌లో నిధులు పెంచాలి. ఉపాధిహామీని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపన్నింది. ఉపాధిహామీని కూలీలకు దూరం చేస్తుంది. పని ప్రదేశంలో వసతులు కల్పించాలి.

మహిళల అభ్యున్నతికి కృషి

-నెల్లూరు : ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబనకు అవసరమైన చర్యలు చేపడుతుందని, అందుకనుగుణంగా జిల్లాలో అర్హత కలిగిన ప్రతి మహిళను స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేర్పించి వారికి ఆర్థిక తోడ్పాటునందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ యం. హరి నారాయణన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో కలెక్టర్ హరి నారాయణన్, డిఆర్డిఎ పిడి సాంబశివా రెడ్డితో కలిసి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుతీరుపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డిపిఎంలు, ఏ.పి.ఎం లు, ఏరియా కో ఆర్డినేటర్స్ పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు : జాతీయ డెంగ్యూ దినోత్సవ సందర్భంగా మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వారి కార్యాలయం నుంచి జిల్లా మలేరియా అధికారి అయినటువంటి డాక్టర్ బ్రిజిత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ ర్యాలీ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. డాక్టర్ ప్రమోద్, డాక్టర్ సునీల్ పిఎంపి జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ ఉన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో

'మేడే' ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలోని విఆర్ హైస్కూల్ క్రీడా మైదానంలో జిల్లా ఆటో కార్మిక సంఘం, నగర కమిటీ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఈ ఉత్సవాలను నగర ట్రాఫిక్ డిఎస్‌పి ఎమ్‌డి సుభహాన్ , ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు రాజా ,సురేష్ ప్రారంభించారు. డిఎస్‌పి సుభహాన్ మాట్లాడుతూ ప్రతి నిత్యం ఆటో కార్మికులు యాంత్రిక జీవన విధానంతో సతమతమౌతూ బిజీబిజీగా గడుపు తుంటారన్నారు. అటువంటి వారికి ఆటవిడుపుగా ఇటువంటి పోటీలను ఏర్పాటు చేయడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నాయని, తగిన జాగ్రత్తలు తీసుకొని పోటీలను నిర్వహించాలని, కార్మికులు వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజా, సురేష్ మాట్లాడుతూ సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్మికులకు దేశవ్యాప్తంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నాలుగు రోజులపాటు జరగనున్న ఈ పోటీల్లో క్రికెట్, రివర్స్ గేర్ ఆటో, మ్యూజికల్ చైర్, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. సిఐటియు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రికెట్ పోటీలకు ఇప్పటికే 10 టీములు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయన్నారు. విజేతలకు 30వ తేదీన పప్పులు వీధి పార్క్ వద్ద జరిగే కార్యక్రమంలో బహుమతులను అందజేస్తామన్నారు. అనంతరం నగర ట్రాఫిక్ డిఎస్‌పి టాస్ వేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. సిఐటి నగర అధ్యక్షులు ఏ శ్రీనివాసులు, సిఐటియు నగర నాయకులు పి సూర్యనారాయణ పి సుధాకర్ ఆటో కార్మిక సంఘం నగర అధ్యక్ష కార్యదర్శులు నాగూర్, వెంగయ్య, మురళి, షేక్ హబీబ్, బాబురావు, జగదీష్, బాబు,చరణ్, నగరంలోని వివిధ స్టాండ్ల ఆటో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి

'ఎస్ఇబి' వాహనం బోల్తా

ఎస్ఐతోపాటు, నలుగురు సిబ్బందికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి -పొదలకూరు : అతి వేగంగా వెళ్తున్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఎస్ఇబి) అధికారుల వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎస్‌బి ఎస్ఐతో సహ మరో నలుగురు సిబ్బందికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని తాటిపర్తి వద్ద మంగళవారం ఉదయం జరిగింది. వివరాల మేరకు తాటిపర్తి వద్ధాశ్రమం మలుపు వద్ద ఎస్ఇఒ వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న నెల్లూరు సెబ్ స్క్వాడ్ ఎస్ఐ బాలకష్ణతోపాటు మరో నలుగురు సిబ్బందికి తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఇసుక రీచ్ వద్ద నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు నెల్లూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు వేగంగా వెళ్తుండగా తాటిపర్తి వృద్ధాశ్రమం మలుపు వద్ద అదుపుతప్పి వాహనం పల్టీలు కొట్టడంతో ప్రమాదం జరిగింది. అటుగా వెళ్తున్న గ్రామస్తులు గమనించి హుటాహుటిన వారిని చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

బోల్తాకొట్టిన కారు

ఎంఎల్‌సి శ్రీకాంత్ పరామర్శ

ప్రజాశక్తి -కందుకూరు : కుప్పం మండలం, మల్లన్నూరు గ్రామ పంచాయితీ పర్తిచేను గ్రామంలో ఏనుగుల దాడిలో మతి చెందిన ఉష కుటుంబ సభ్యులను ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ మంగళవారం పరామర్శించారు. ఉష చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ఏనుగుల దాడిలో ఉష మతి చెందటం బాధాకరమన్నారు. వారి కుటుంబానికా అండగా ఉంటామన్నారు. టిడిపి నాయకులు పిసి సాంబశివమ్, మాజీ ఎంపీపీ కుప్పం రూరల్ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, కుప్పం అర్బన్ అధ్యక్షుడు రాజకుమార్, కుప్పం మాజీ ఎంపీపీ డాక్టర్ వి వెంకటేష్, రామచంద్రన్ ఉన్నారు.

సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి -కందుకూరు : మండలంలోని పందలపాడులో జాషువా యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా స్థాయి సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మంగళవారం కందుకూరు బ్లూడైమండ్స్ టీమ్, ఉలవపాడు టీమ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో బ్లూడైమండ్స్ టీమ్ 12 ఓవర్లలో 135 పరుగులు చేసి ఉలవపాడు టీమ్‌ను 9 ఓవర్లలో 52 పరుగులకే ఆలౌట్ చేసి విజేతగా నిలిచింది. బ్లూడైమండ్స్ టీమ్‌లో అభిలాష్ 92 పరుగులు చేసి మూడు వికెట్లు తీసినందుకుగాను మాన్ అఫ్ ది మ్యాచ్‌గా ఎంపిక చేయడమైనది. మాన్ అఫ్ ది మ్యాచ్ నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, ఆలూరి చిరంజీవి, గౌడపేరు కార్తీక్ చేతుల మీదుగా అభిలాష్ అందుకున్నట్లు నిర్వాహకులు వర్ల కోటి, వర్ల రాజా, వర్ల కిషోర్ బాబు తెలిపారు.

భవన నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి -గుడ్లూరు

వెలుగు కార్యాలయం అధికారుల ఆధ్వర్యంలో నడుస్తున్న రైతు సంఘాల కోసం నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గుడ్లూరు నుంచి కొత్తపేటకు వెళ్లే రహదారి మార్గంలో రైతు సంఘాల భవనం నిర్మాణ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు.. నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన అన్నారు. భావన నిర్మాణానికి 15 లక్షలు నిధులు మంజూరు కాగా అందులో మూడు లక్షల 75 వేలు తొలి విడతగా నిర్వాహకులకు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. నిధులు ఖర్చు కాగానే మిగతా నిధులు మంజూరు చేస్తా బడ్డారు వారి తోటి రైతు సంఘాల సిసి ఇందిరమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ఉదాసీనత

ప్రజాశక్తి -కందుకూరు : ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం ఉధతం చేస్తామని అమరావతి ఎపిజెఎసి నెల్లూరు జిల్లా శాఖ అసోసియేట్ చైర్మన్ ఈవిఎం శరత్ బాబు తెలిపారు. ఎపి జెఎసి అమరావతి చేపట్టిన మూడో దశ ఉద్యమ కార్యచరణలో భాగంగా ఎంఎల్‌ఎలకు, ఎంపీలకు ఉద్యోగుల ఆవేదనని చెబుదాం కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంగళవారం ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డికి ఎపిజెఎసి అమరావతి జిల్లా నాయకులు వినతిపత్రం అందజేశారు. అమరావతి ఎపి జెఎసి నెల్లూరు జిల్లా శాఖ టీం అసోసియేట్ చైర్మన్ ఈవిఎం శరత్ బాబు ఆధ్వర్యంలో మహీధర్ రెడ్డిని కలిసి సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. శరత్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగుల సమస్యలు పట్టడం లేదన్నారు. అమరావతి జెఎసి నెల్లూరు జిల్లా టీం కార్యవర్గ సభ్యులు, జె చైతన్య కిషోర్, బి చిన్నయ్య, అల్లం సురేష్ బాబు, డాక్టర్ ఈ చెన్నకేశవులు, షేక్ రియాజ్ , శ్రీకాంత్ , వెంకటేశ్వర్లు, సిద్ధయ్య ఉన్నారు.

పాదయాత్ర జయప్రదం కోరుతూ పూజలు

ప్రజాశక్తి -కందుకూరు : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రజా సమస్యల తెలుసు కుంటూ కొనసాగిస్తున్న యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకుంది. ఈ యాత్ర దిగ్విజయంగా కొనసాగాలని కోరుకుంటూ టిడిపి నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో 13వ వార్డులో బ్రహ్మంగారి దేవస్థానంలో 101 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేసారు. పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. పొడపాటి శ్రీను, బత్తిన వెంకటేశ్వర్లు, మువ్వా మల్లికార్జున, ఇంటూరి సింహాద్రి, గంగవరపు బ్రహ్మయ్య,నల్లమోతు శ్రీహరి నాదెళ్ల వెంకట రమణయ్య, పిన్నంరాజు ప్రభాకర రావు, సయ్యద్ జియా, షేక్ కరిముల్లా పెదకత్తుల రవి, పెదకత్తుల కోటేశ్వరరావు, జక్కుల హరి, బెంగుళూరు సుధాకర్, చాపల్లి మణి ఉన్నారు.

'నాడు -నేడు' పనులు వేగవంతం

ప్రజాశక్తి-నెల్లూరు

"నాడు -నేడు" అభివద్ధి పనులను వేగవంతం చేసి పాఠశాలల పునప్రారంభం నాటికి అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలను విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. స్థానిక నవాబు పేట మున్సిపల్ పాఠశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు.కమిషనర్ మాట్లాడుతూ అదనపు తరగతి గదులతో పాటు నూతన మరుగుదొడ్ల నిర్మాణాలను జూన్ 12 వ తేదీ నాటికి పూర్తి చేయాలని చెప్పారు. నిర్మాణ పనులన్నీ అత్యంత నాణ్యతతో, పారదర్శకంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. సుబేదారు పేట ప్రాంతంలో నిర్మాణమవుతున్న ప్రజా మరుగుదొడ్ల పనులను కమిషనర్ తనిఖీ చేశారు.

ఇంజనీరింగ్ విభాగం ఎస్ఇ సంపత్ కుమార్, ఈఈలు చంద్రయ్య, అనిల్, ఎఇ మాధవి, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకార భరోసా నిధులు జమ

ప్రజాశక్తి-నెల్లూరు :

ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్ఆర్ మత్స్యకార భరోసా పథకంలో జిల్లాలో 12,072 మంది అర్హులైన మత్స్యకార కుటుంబాలు లబ్ధి చేకూరిందని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. సిఎం మంగళవారం బాపట్ల జిల్లా నిజాంపట్నంలో జరిగిన భారీ బహిరంగ సభలో మత్స్యకార భరోనా నిధులను బటన్ నొక్కి మత్స్యకారుల ఖాతాలో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయ తిక్కన ప్రాంగణం నుంచి జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ , కలెక్టర్ హరి నారాయణన్ వర్చువల్ గా పాల్గొని వీక్షించారు. అనంతరం ఆనం అరుణమ్మ విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 12072 మంది మత్స్యకారులు రూ. 12. 7 కోట్ల మే లబ్ధి పొందారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సముద్రంలో వేసవిలో వేట నిషేధ సమయంలో జాలర్ల కుటుంబాలకు తోడుగా ఉండి జీవనం సాగించడానికి భరోసా కింద ఆటుకుంటుందన్నారు. ఈ నిధులను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు ఎం నాగేశ్వరరావు, ఏడీలు విజయ కష్ణ, శ్రీనివాసరావు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి పరిశీలన

నెల్లూరు : నగరంలోని నవాబుపేట పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్‌పి తిరుమలేశ్వర్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు కేసులకు సంభందించిన రికార్డులను పరిశీలించారు. స్టేషన్ ఆవరణంలో శిథిలావస్థలో ఉన్న వాహనాలను కోర్టు అనుమతితో వేలం వేయాలని సిఐ సుబ్బారావుకు సూచించారు. పోలీస్ స్టేషన్ మ్యాప్, చార్ట్ ను పరిశీలించి నేర, శాంతి భద్రతల పరిస్థితులపై ఆరా తీశారు. గ్రేవ్ కేసుల సిడి ఫైల్స్ ను పరిశీలించి పలు ఆదేశాలు జారీ చేశారు.

పార్క్ స్థలం ఆక్రమణపై విచారణ

ప్రజాశక్తి-నెల్లూరు : రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఎఫ్.సి.ఐ గోదాముల సమీపంలోని చైతన్యపురి పార్క్ స్థలం ప్రయివేటు వ్యక్తుల పరమైనట్లు వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక అందించాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. పార్క్ స్థలాన్ని కమిషనర్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు.

మేయర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు : నగరపాలక సంస్థ సిబ్బంది పని తీరును ప్రత్యక్షంగా పరిశీలించేందుకు మేయర్ స్రవంతి జయవర్ధన్ మంగళవారం ఆకస్మికంగా వివిధ విభాగాలను తనిఖీ చేశారు. కార్యాలయంలోని ఎస్టాబ్లిష్మెంట్, ప్రజారోగ్యశాఖ, టౌన్ ప్లానింగ్ విభాగాలను అధికారులతో కలిసి సందర్శించిన మేయర్ విభాగాల వారీగా నిర్వహిస్తున్న విధులను, సిబ్బంది పని తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రతి విభాగంలోని రెగ్యులర్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది హాజరు రిజిస్టరు, స్పందన ఫిర్యాదుల రిజిస్టర్లను మేయర్ పరిశీలించారు.

నిబంధనలకు విరుద్ధంగా క్లాసుల నిర్వహణ

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలో వేసవి సెలవుల సమయంలో ప్రయివేటు కార్పొరేట్ కళాశాలలు ప్రభుత్వ నిబం ధనలకు వ్యతిరేకంగా క్లాసులు నిర్వహించడం సరికాదంటూ ఎస్ఎఫ్ఐ నగర కమిటీ హెచ్చరించింది. ఏప్రిల్ 21వ తేదీ నుంచి ఇంటర్ బోర్డు అధికారికంగా ఇంటర్ చదివే విద్యార్థులకు వేసవి సెలవులు ప్రకటించినప్పటికీ నగర పరిధిలో ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలో విశ్వ సాయి, నారాయణ, కష్ణ చైతన్య, వివేకానంద, రావుస్ మొదలైన కాలేజీలు తరగతులు నిర్వహిస్తున్నాయన్నారు. ఈ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి వి. నరేంద్ర డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలో ఉన్న కళాశాలలను పరిశీలించి కళాశాలల యాజమాన్యం ఆధ్వర్యంలో విద్యార్థులతో మాట్లాడారు. అఖిల్, పవన్ ,సాజిద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

గుండె సంబంధిత వ్యాధుల నివారణపై అవగాహన

నెల్లూరు : హైపర్ టెన్షన్ గుండె జబ్బులకు ప్రధాన కారణంమని హైపర్ టెన్షన్ గుర్తించి జాగ్రత్తలు పాటిస్తే గుండె జబ్బుల నుంచి దూరంగా ఉండవచ్చునని మెడికవర్ హాస్పిటల్ సీనియర్ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ విజయ్ అమర్నాథ్ రెడ్డి, డాక్టర్ మాలేపాటి భాలకష్ణ, డాక్టర్ కడియాల రాం ప్రసాద్, డాక్టర్ జయరామ్ పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ హైపర్ టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికవర్ హాస్పిటల్ లో వైద్యులు మంగళవారం అవగాహన నిర్వహించారు. సీనియర్ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ విజయ్ అమర్నాథ్ రెడ్డి, డాక్టర్ మాలేపాటి భాలకష్ణ, డాక్టర్ కడియాల రాం ప్రసాద్, డాక్టర్ జయరాం మాట్లాడారు. ఏడాదికి ఒక సారి గుండె పరీక్షలను తప్పని సరిగా నిర్వహించుకోవాలని సూచించారు. మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్ తక్కువ ఫీజుతోనే గుండె సంభందిత పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెడికవర్ వైద్య సేవలను, తక్కువ ఫీజుతో అందిస్తున్న వైద్య పరీక్షలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైస్ ప్రెసిడెంట్ మహేశ్వర్ రెడ్డి ఉన్నారు.



విద్యార్థికి మేయర్ అభినందనలు

నెల్లూరు : ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి 581 మార్కులతో పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిన బుచ్చిరెడ్డి పాళెం వివేకానంద పాఠశాల విద్యార్థిని హర్షినికి అభినందనలు తెలియజేసిన మేయర్ శ్రీమతి స్రవంతిజయవర్ధన్. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మేయర్ ఆకాక్షించారు.

కారుణ్య నియామక పత్రం అందజేత

నెల్లూరు : నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో ఫౌంటెన్ క్లీనర్ గా గొర్రిపాటి స్వస్తిక్ కు బాధ్యతలు కల్పిస్తూ కమిషనర్ వికాస్ మర్మత్‌కారుణ్య నియామక పత్రాలను మంగళవారం అందజేశారు. విధి నిర్వహణల్లో అనునిత్యం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

పొదలకూరు : పొదలకూరు పట్టణంలోని శ్రీనివాస్ లే అవుట్‌లోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ప్రథమ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజైన మంగళవారం శ్రీనివాసులు కల్పవక్ష వాహనంపై మాడవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ఆకులూరు మధు, నీరజ, ఆకులూరి హేమంత్ అనురాధ, మన్నెం కోటేశ్వరరావు, శేషమ్మ, దాసినేని ప్రసాదాయుడు. పుష్పలత చంద్రశేఖర్. ఆనందమ్మ. శ్రీనివాసులు, లక్ష్మీ వెంకటసుకన్య, సింహాచలం, జయమ్మ వ్యవహరించారు.

ఉత్సాహభరితంగా క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం నగర (సీఐటీయు) కమిటీ ఆధ్వరంలో మంగళవారం నెల్లూరు నగరంలోని వి ఆర్ సి మైదానంలో ఆటో కార్మికులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు నగరం నుంచి పూలే బొమ్మ స్టాండ్ వర్సెస్ తోటపల్లిగూడూరు మండలం నరుకూరు సెంటర్ ఆటో స్టాండ్ కార్మికుల మధ్య క్రికెట్ పోటి జరిగింది. ఈ పోటీల్లో పూలేబొమ్మ ఆటో స్టాండ్ కార్మికులపై నరుకూరు సెంటర్ ఆటో స్టాండ్ కార్మికులు ఘన విజయం సాధించారు. మొదట బ్యాటింగ్ చేసిన పూలే బొమ్మ ఆటో స్టాండ్ ఆటో కార్మికులు 10 ఓవర్లకు గాను 68 రన్స్ చేసి 5 వికెట్లు కోల్పోయారు. అనంతరం 68 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన తోటపల్లిగూడూరు మండలం నరుకూరు సెంటర్ ఆటో స్టాండ్ కామ్రేడ్స్ కేవలం 6 ఓవర్ల 5 బాల్స్ లో 3.1 ఓవర్లలోనే (69/2) లక్ష్యా న్ని చేదించారు. వైస్ కెప్టెన్ గణేష్ 52 రన్స్ చేసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ గా నిలిచాడు. జట్టులో ఎన్. శివ (కెప్టెన్), కె. గణేష్ (వైస్ కెప్టెన్), వినయ్ (వికెట్ కీపర్), కె. వెంకట శేషయ్య, ఎన్. వెంకటేష్, మహేష్, సుమన్, రవి, ఎల్లి గోపి, యాసిన్, మారుబోయిన రాజా, ఎన్. పరశురామయ్య, కె. మల్లికార్జున, కోసూరు నారాయణ, భాషతో కలిపి మొత్తం 15 మంది సభ్యులు ఉన్నారు.

బాధ్యతారాహిత్యం విడనాడాలి

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం ఆసుపత్రి అభివద్ధి కమిటీ సమావేశం జరిగింది.ఎంఎల్ఎ, అభివద్ధి కమిటీ చైర్మన్ మానుగుంట మహీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆసుపత్రిలో అవసరమైన వస్తువులు, రోగులకు మెరుగైన వసతులపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఎంఎల్ఎ మాట్లాడుతూ భవనానికి క్యూరింగ్ సరిగా జరగటం లేదన్నారు. క్యూరింగ్ సరిగా జరిగితేనే ఆ భవనం యొక్క మన్నిక మరిన్ని రోజులు ఉంటుందన్నారు. ఆస్పత్రిలో ఉన్న ఎసిలకు ఎసి గ్యాస్ ఈ ఫీలింగ్ చేసేందుకు నెల రోజులు సమయం ఎందుకు పడుతుందని ప్రశ్నించారు. ఇక్కడ ఉన్న ప్రతి పైసా ప్రజల సొమ్ము వాటికి జవాబు దారితనంగా మనం ఉండాలే తప్ప, బాధ్యతారాహిత్యంగా ఉండకూడదన్నారు. ఆరోగ్య మిత్ర బయోమెట్రిక్ డివైసర్ కొనుగోలు విషయంలో ఎంఎల్ఎ ఒకింత ఆగ్రహానికి గురి అయ్యారు. బయో మెట్రిక్ అవసరమయ్యే మంచి డివైసర్ కొంటామే తప్ప, ఇష్టానుసారంగా ఏది చెప్తే అది కొనమని తేల్చి చెప్పారు. ఆస్పత్రిలో దోమలు రాకుండా కిటికీలకు దోమల మెస్ ఏర్పాటు చేయించామన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ

క్లాసులు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి -వెంకటాచలం : విక్రమ సింహపురి యూనివర్సిటీలో మంగళవారం యూనివర్సిటీ రిజిస్టర్ డాక్టర్ రామచంద్రారెడ్డికి ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ జిల్లా ఇన్‌ఛార్జి పి సురేష్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. వేసవి సెలవులు ఇచ్చినప్పటికీ పలు ప్రయివేటు కళాశాలలు మాత్రం ఇప్పటివరకు వేసవి సెలవులు ఇవ్వలేదని తెలిపారు. దీనిపై స్పందించిన రిజిస్ట్రార్ ఉత్తర్వులను ఉల్లంఘించన కళాశాలలపై చర్యలు తీసుకుంటామన్నారు.

వీధి కుక్కలకు టీకాలు

ప్రజాశక్తి-నెల్లూరు : వీధికుక్కల కాటునుంచి ప్రజలకు ప్రమాదకర పరిస్థితులు తలెత్తకుండా నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజనుల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కుక్కలకు యాంటి రాబిస్ టీకాలు అందిస్తున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ వెల్లడించారు. స్థానిక బాలాజీ నగర్ కాంతమ్మ ఆశ్రమం సమీపంలోని సచివాలయం వద్ద వీధికుక్కలకు రాబిస్ టీకాలు వేసే కార్యక్రమాన్ని కమిషనర్ మంగళవారం ప్రారంభించారు.కమిషనర్ మాట్లాడుతూ వీధి కుక్కల సమస్యలపై 9553219996 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. కార్పొరేటర్లు సుజాత, శ్రీకాంత్ రెడ్డి, నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, పశు వైద్యాధికారి డాక్టర్ మదన్ మోహన్ ఉన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ

ప్రజాశక్తి-అనంతసాగరం

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని తహశీల్దార్ వెంకటరమణారావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు తెలుగు పద్యాలు, భావాలు, కథలు స్పష్టంగా ఉచ్ఛరించడంతో విద్యార్థుల ప్రతిభను మెచ్చుకొని, వారికి బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థులందరూ వక్తృగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మేధస్సును పెంచుకోవాలని కోరారు. గ్రంథాలయ అధికారి నారాయణ మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు విద్యార్థులను గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలకు వచ్చేలా ప్రోత్సహించాలని, ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అలాగే పుస్తక పఠనం కథలు కథనాలు సృజనాత్మక కార్యక్రమాలు చిత్రలేఖనం ఇక్కడ సృజనాత్మకతను పెంపొందించేలా సహాయపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓ నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి మోహన్ రావు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం..

ప్రజాశక్తి-కావలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అటవీశాఖవారు నిర్వహించిన పర్యావరణ హిత జీవన విధానం అనే ర్యాలీలో కందుకూరు, ఉలవపాడు మండలం డిప్యూటీ అటవీశాఖ అధికారి సుజాతతో పాటు డి.వి.ఎం.సి. సభ్యులు న్యాయవాది ఐ.సాయిప్రసాద్ పాల్గొన్నారు. ముఖ్యంగా ఇంధనం పొదుపు చేయడం నీటిని పొదుపు చేయడం, వ్యర్థాలను తగ్గించడం, 40 మైక్రాన్స్ కంటే తక్కువ కలిగిన ప్లాస్టిక్ కవర్లను నివారించడం, వంటి వాటిని లక్ష్యంగా చేసుకుని జీవన శైలి మార్చుకుంటే త్వరగా కొంత వరకు పర్యావరణాన్ని రక్షించవచ్చన్నారు. అలాగే పర్యావరణాన్ని పరిరక్షించడానికి తమరోజు వారి జీవితంలో సాధ్యమయ్యే అన్ని మార్పులు చేస్తామని అక్కడివారితో ప్రతిజ్ఞ చేయించారు. స్థిరమైన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల చక్కటి ఆరోగ్యానికి మేలు కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది ఎం.బాబూరావు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

జ్యోతిబాబురావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు జన్మదినం సందర్భంగా మంగళవారం కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వారి నివాసం వద్ద జరుగుతున్న వేడుకల్లో భాగంగా సుబ్బానాయుడు హాజరై, బాబూరావుకు శాలువాను కప్పి, పూలమాల వేసి సన్మానించారు. తదుపరి ఇరువురు కలిసి కేకును కత్తిరించి వచ్చిన పార్టీ శ్రేణులకు పంచి పెట్టారు. అధిక సంఖ్యలో పాల్గొన్న టిడిపి శ్రేణుల సమక్షంలో సుబ్బానాయుడు మాట్లాడుతూ జ్యోతి బాబూరావు లాంటి వ్యక్తులు పార్టీలో మరెన్నో పదవులు అధిరోహించాలని, నిండు నూరేళ్ళ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కొనియాడారు.

డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్ట్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-కావలి

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి వారి ఆధ్వర్యంలో విక్రమ సింహపురి యూనివర్సిటీ పీజీ కాలేజీ కావలిలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉచిత శిక్షణ ఎటువంటి ప్రవేశ రుసుము లేకుండా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విలియమ్ శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కాల పరిమితి మూడు నెలలు ఇవ్వడం జరుగుతుందని ఈ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు రవాణా ఖర్చులు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణలో చేరబోవు విద్యార్థులకు కనీస వయసు 18 సంవత్సరాలు గరిష్ట వయసు 35 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. విద్య అర్హతలు టెన్త్ క్లాస్ ఇంటర్మీడియట్ డిగ్రీ కనీస విద్యార్హత టెన్త్ తప్పనిసరిగా పాసై ఉండాలని తెలిపారు. ఈ శిక్షణ తరగతులు మే 22వ తేదీ నుండి ప్రారంభమవుతుందన్నారు. స్కిల్ హబ్ కోఆర్డినేటర్ 6301543185, 9182031895 పీజీ సెంటర్ కోఆర్డినేటర్ 8686969123లను సంప్రదించాలన్నారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా..

- ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకులు ధనుంజయ రెడ్డి

ప్రజాశక్తి-వరికుంటపాడు

తాను మెట్ట ప్రాంతానికి చెందిన వ్యక్తినే, రైతు సమస్యలు తెలిసిన వ్యక్తిని ఒక్కసారి అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి అన్నారు. మంగళవారం వరికుంటపాడు వైసిపి మండల పార్టీ కన్వీనర్ బాల గురవారెడ్డి గృహంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి నేతల సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. త్వరలోనే ఉదయగిరి నియోజకవర్గానికి మంచి సమర్థత కలిగిన ప్రజా సమస్యలు పరిష్కరించ గలిగిన వ్యక్తి ఇన్‌ఛార్జిగా వస్తారని తెలిపారు. అలాగే తాను కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశిస్తే పోటీ చేసేందుకు సిద్ధమని, తనపై కొంతమంది వ్యక్తులు సోషల్‌మీడియాలో నాన్ లోకల్ అంటూ విమర్శిస్తున్నారని అలాంటి వ్యక్తులకు తాను చెప్పేదొకటేనని తాను ఏడు సంవత్సరాల పాటు కోఆపరేటివ్ బ్యాంక్ జిల్లా అధ్యక్షుడిగా పని చేశానని, అలాగే తన స్వగ్రామం కూడా నియోజకవర్గానికి అతి దగ్గరగా ఉంటుందని, తన గ్రామం కూడా మెట్ట ప్రాంతంలోనే ఉందన్నారు. వరికుంటపాడు మండలంలో అనేక సమస్యలు ఉన్నాయని అనంతరం మండల పార్టీ కన్వీనర్ బాల గురువారెడ్డి జెడ్‌పిటిసి రాజేశ్వరి నాగేంద్ర, నియోజకవర్గ పరిశీలకులు మెట్టుకూరు ధనుంజయ రెడ్డి దృష్టికి తీసుకురాగా ముఖ్యంగా రెవెన్యూ పరమైన సమస్యలు అధికంగా ఉన్నాయని కార్యాలయానికి వెళ్తే పట్టించుకొనేవారు లేరంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి శ్రీనివాస నాయుడు, సర్పంచులు సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, నేతలు మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

ప్రజాశక్తి-ఉదయగిరి

సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు బయోమెట్రిక్ హాజరు శాతం తప్పనిసరిగా ఉండాలని ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని తిరుమలాపురం సచివాలయాన్ని ఎంపిడిఒ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు బయోమెట్రిక్ హాజరు వేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మినిమం 50శాతం హాజరు వేయాలని సిబ్బందికి గ్రామ వాలంటీర్లకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా వాలంటీర్లు ఆయుష్మాన్ భారత్ సర్వే లో వెనకబడి ఉన్నారు. అందరూ వాలంటీర్లు ఎఎన్ఎంలు, ఆశ సహకారంతో 100 శాతం ఆయుష్మాన్ భారత్ సర్వేను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. అలసత్వం వహించే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యదర్శి వెంకటరమణ, దయానా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలను సంరక్షించడం అభినందనీయం

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం వెంగళరావు నగర్‌లో ఉన్న సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో పేదపిల్లల విద్య, వైద్యం సంరక్షణ విభాగం ద్వారా దాతల సహకారంతో మంగళవారం 22 మంది పిల్లలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, బియ్యం, పోస్ట్ ఆఫీస్‌లో ప్రతినెల రూ.1000 డిపాజిట్ చేస్తున్న పాస్‌పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఏ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పాల్గొని సంస్థ సంరక్షణలో ఉన్న పిల్లలకు నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చైర్మన్ సన్నపోయిన ప్రసాద్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు గంధం ప్రసన్నాంజనేయులు, కనపర్తి రాజశేఖర్, కమరాజు సురేష్, నెల్లూరు వెంకటేశ్వర రెడ్డి, క్రిష్టి రెడ్డి, స్వచ్ఛంద సంస్థ గౌరవ అధ్యక్షుడు షేక్ భాషా రసూల్, దాతలు ఎం.అజిత్ బాబు, పి.వెంకటసాయిలేఖ, శ్రీనివాసరావు, విజయ్, వైసిపి కార్యకర్తలు, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈనాటి ముఖ్యఅతిథి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సురేంద్ర చేస్తున్న సేవలను అభినందించారు. అలాగే సంయుక్త సేవాసంస్థ సంరక్షణలో ఉన్న 22మంది పేదపిల్లలకు ప్రతినెల నిత్యావసర వస్తువులు బియ్యం పోస్ట్ ఆఫీస్‌లో నగదు జమ చేస్తున్న దాతలను అభినందించారు. సంయుక్త సేవాసంస్థ ద్వారా ప్రతిరోజూ సేవలు అందించడం కోసం సహాయం చేస్తున్న దాతలకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న క్రిష్టి రెడ్డి సంస్థ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను గురించి తెలుసుకున్న వెంటనే స్పందించి రూ.5000 సంస్థ అధ్యక్షుడు సురేంద్రకు ఎంఎల్ఏ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. సంస్థకు ఎప్పుడు అవసరమైనా సహాయాన్ని అందజేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ సంయుక్త సేవాసంస్థ ద్వారా పేద పిల్లలకు నిత్యావసర వస్తువులు, విద్యా ఉపకరణాలు కూడా అందజేస్తామని తెలిపారు. అంతేకాకుండా తన కుమార్తె లిఖిత నృత్య కళా నిలయం నిర్వహించేందుకు అవసరమైన స్థలాన్ని తన తరఫు నుంచి ఇప్పించి బిల్డింగ్ నిర్మించడానికి ఆర్థికంగా కూడా సహాయం పడతామని తెలియజేసిన ఎంఎల్ఏకు తమ కుటుంబం రుణపడి ఉంటుందని తెలిపారు.

విద్యుత్ కోతలను అరికట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-కావలి



డిఇఇతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

కావలి పట్టణంలో కొన్ని రోజుల నుండి ఉన్న కరెంటు కోతలు ఆపాలని మంగళవారం ఎపిఎస్‌పిడిసిఎల్ డి.ఇ.ఇ. ఆఫీస్ వద్ద సిపిఎం నాయకులు ధర్నా చేశారు. అనంతరం డి.ఇ.ఇ. విజయ్ కుమార్ రెడ్డికి అర్జీని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ పట్టణంలో కొన్ని రోజుల నుండి కరెంట్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. రాత్రి, పగలు అని తేడా లేకుండా కరెంట్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. దీని వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. రాత్రి వేళల్లో రెండు మూడు సార్లు కరెంటు పోతున్నందు వల్ల నిద్ర సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు చాలా ఇబ్బందులకు గురవుతున్నందు వల్ల తల్లిదండ్రులు ఆందోళనలకు గురవుతున్నారని తెలిపారు. అంతే కాకుండా కరెంటు అంతరాయంతో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య కూడా ఏర్పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కరెంటు బిల్లులు పెంచడమేకాక, ట్రూఅప్ ఛార్జీలు, ఇతర యూజర్ ఛార్జీల పేరుతో ప్రజల దగ్గర డబ్బులు అధికంగా వసూలు చేసుందన్నారు. పూర్తిగా కరెంటు ప్రజలకు అందించటంలో అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని మంచి పాలన అందిస్తామని, చెప్పి అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపడం తప్ప సమస్యలను పరిష్కరించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి కరెంటు అంతరాయం కలగకుండా సరఫరా చేయాలని సిపిఎం తరఫున డిమాండు చేస్తున్నామన్నారు. అలా జరగని పక్షంలో ప్రజలను సమీక్షించి, ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు వై.క్రిష్ణమోహన్, జి.మధుసూదన రావు, సిపిఎం నాయకులు పి.సాయి, వి.బాబు రావు, పి.అన్వర్, డి.వై.ఎఫ్.ఐ. నాయకులు పి.కోటేశ్వరరావు, కె.చెన్నయ్య, కె.ప్రభాకర్ తదితరులున్నారు.

ఘాట్ రోడ్డులో పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి

సిబ్బందితో మాట్లాడుతున్న జెసి కూర్మానాథ్

బండగానిపల్లి - ఉదయగిరి మధ్యలో ఉన్న ఘాట్ రోడ్డును మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ పరిశీలించారు. బండగానిపల్లి - ఉదయగిరి చేపట్టనున్న ఘాట్ రోడ్డు నిర్మాణ మార్గాన్ని జెసి పరిశీలించారు. ఉదయగిరి ఘాట్ రోడ్డుకు 3.2 కిలోమీటర్లకు వెంకటాచలం మండలం వడ్లమూడిలో అటవీ ప్రతంలో చేపట్టే రోడ్డు నిర్మాణాలకు అటవీ భూమి కోల్పోవడంతో అందుకు ప్రత్యామ్నాయంగా కొండాయపాలెం పంచాయతీ నేలటూరు గ్రామ పరిధిలో సర్వేనెంబర్ 1261, 1262 లో 11 హెక్టార్ల ప్రభుత్వ భూమిని కేటాయించగా ఈ సందర్భంగా అప్పగిస్తున్న భూములను జెసి పరిశీలించారు. ముందుగా ఆర్అండ్‌బి ఎస్‌సి ఎం గంగాధరంను అటవీ శాఖ రేంజ్ అధికారి ఉమామహేశ్వర్ రెడ్డిని రోడ్డు నిర్మాణంలో తీసుకోవాల్సిన సూచనలు సలహాలు చేసి తహశీల్దార్ సానా శ్రీనివాసులు రెడ్డిని ప్రభుత్వ భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఎంబి ఏఈలు నరేష్, అనిల్‌రెడ్డి, విఆర్ఒ వెంకటరమణ, నాయకులు మూలే సుబ్బారెడ్డి, కల్లూరి కృష్ణారెడ్డి అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

600మందికి మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-కావలి

పట్టణంలోని ఎ.ఎం.బేకరి సెంటర్‌లో మంగళవారం ఆద్వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 600మందికి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆద్వి ఫౌండేషన్ వ్యవస్థాపకులు బెజవాడ ప్రసన్నకుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆద్వి ఫౌండేషన్ సభ్యులు యోగానంద, విజయ్, జగదీష్, సాయి, శేషయ్య, రాజా, తదితరులు పాల్గొన్నారు.

నిందితులకు యావజ్జీవ శిక్ష

క్రైం కార్నర్

ప్రజాశక్తి-కలిగిరి

కలిగిరి పంచాయతీ పాపన ముసలిపాలెం గ్రామంలో పొలం తగాదా విషయంలో గతంలో తగాదాబడి కంపకర్ర కర్రలతో హత్య చేసిన నలుగురికి యావజీవ శిక్ష పడినట్లు ఎస్ఐ సూర్యప్రకాశ్ రెడ్డి మంగళవారం తెలిపారు. గణేశం శ్రీనివాసలరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, సుబ్బారెడ్డిలు, సానా సుబ్బారెడ్డి కొండిరెడ్డి సుబ్బారెడ్డి,సాన వెంకటసుబ్బారెడ్డిలను కర్రలతో అతి కిరాతకంగా చంపిన కేసులో యావజీవశిక్ష పడిందన్నారు.

మూడు పొగాకు బ్యారెన్లు దగ్ధం

- రూ.80 లక్షల పైగా ఆస్తి నష్టం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరుపాలెంలో చెరుకూరు పెద్దకామాక్షయ్య నాయుడు మరోఇద్దరికి సంబంధించిన మొత్తం మూడు పొగాకు బ్యారెన్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో నిప్పు అంటుకొని దగ్ధమయ్యాయి. పక్కపక్కనే వరుసగా ఉన్న ఈ మూడు బ్యారెన్లలలో క్యూరింగ్‌లో ఉన్న పొగాకుతో పాటు పక్కనే వేలంలో అమ్మకానికి తరలించేందుకు సిద్ధంగా ఉన్న పొగాకుతో కలిపి మొత్తం రూ.80 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని రైతులు వారి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దగ్ధమవుతున్న పొగాకును బయటికి తెచ్చేందుకు ప్రయత్నించిన చెరుకూరు.చిన్ననాయుడు అనే రైతుకు చేతులు కాలి గాయాలు కావడంతో వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఫైర్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

ప్రమాద ప్రాంతంలో కమిషనర్ సందర్శన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరుపాలెం ప్రాంతంలో మూడు పొగాకు బ్యారెన్లు దగ్ధమైన విషయం తెలిసి సంఘటన స్థలానికి చేరుకొన్న ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి ప్రమాద కారణం తెలుసుకున్నారు. ఎండా తీవ్రత దృష్ట్యా మంటలు త్వరగా వ్యాపించి ఆస్తి నష్టానికి కారణమయ్యాయని ఎండల కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ కమిషనర్ సూచించారు. వీరివెంట వార్డు కౌన్సిలర్ కామాక్షయ్య నాయుడు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది హాజరయ్యారు.

పేకాట స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని వేంపాడు గ్రామ చెరువు కట్ట సమీపంలో సోమవారం రాత్రి పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు ఎస్ఐ విజయ్ శ్రీనివాస్ తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఏడుగురు వ్యక్తులను రూ.10400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నారాయణ, కానిస్టేబుల్ కిన్నెర ప్రసాద్, చంద్రపాల్, హోంగార్డ్ చంద్ర, పాపయ్య పాల్గొన్నారు.

జాతీయ డెంగీ నివారణ దినోత్సవం

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మంగళవారం భారీ ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కావలి మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.రవికుమార్ పాల్గొని మాట్లాడుతూ డెంగీ వ్యాధి ఎలా వస్తోంది, దాని లక్షణాలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స ప్రాధాన్యత, వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రతి శుక్రవారం డ్రైడే ప్రాముఖ్యత, పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యత గూర్చి విపులంగా తెలియజేశారు. డెంగీ వైరస్‌తో ఇన్ఫెక్ట్ అయిన ఆడ ఏడిస్ ఈజిప్టై జాతి దోమ కుట్టడం ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. కావలి ఏరియా ఆసుపత్రిలో డెంగీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఎలీసా, వైద్య సేవలను పూర్తి ఉచితంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎం.పి.హెచ్.ఇ.ఒ. కృష్ణారెడ్డి, వర ప్రసాద్, పి.హెచ్.ఎన్. మేరీ, ఆరోగ్య పర్యవేక్షకులు శివపార్వతి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది డెంగీ నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ మాట్లాడుతూ మురుగు నీరు ఆవాసంగా దోమలు విజృంభిస్తాయని తెలిపారు. ఏడిస్ దోమలు కుట్టడం వల్ల కం దరాలనొప్పి, తీవ్రమైన జ్వరం బారిన పడేలా చేస్తుందని, జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అశ్రద్ధ వహిస్తే ఎర్ర రక్తకణాలు తగ్గిపోతాయని, సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోవాలన్నారు. ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని, కూలర్లు, పూలకుండీలు, వాడేసిన టైర్లు, కొబ్బరి బోండాల్లో నీరు నిల్వవుండడంతో దోమలు ప్రమాదకరంగా తయారవుతాయన్నారు. ఇంటిలో నీళ్ల తొట్టెలను వారానికొకసారి శుభ్రం కడగాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ కల్పన, మండల విస్తరణ అధికారి కొండారెడ్డి, సిహెచ్ఒ రోస్‌లీన్, సూపర్‌వైజర్లు సైదా, ఖాజామొహిద్దీన్, సచివాలయ ఎఎన్ఎం రమణమ్మ, సిద్ధమ్మ ఎల్‌టి రత్నమ్మ, ఆశా సుబ్బమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ సెంటర్ అర్బన్ హెల్త్ సెంటర్ నుండి సోమశిల రోడ్డు సెంటర్ వరకు ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం సోమశిల సెంటర్ల సెంటర్లో మానవహారం ఏర్పాటు చేసి డెంగ్యూ నివారణపై నినాదాలు చేశారు. తదుపరి అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్య సిబ్బందికి డెంగ్యూ వ్యాధిపై అవగాహన, నివారణపై చేపట్టాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మహిమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆర్.రాకేష్, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ఎస్.కె.అస్మా, సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్కే.ఖాదర్ బాషా, సిబ్బంది, ఆశావాలంటీర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలని ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-ఉదయగిరి

ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్‌ను నిషేధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కుర్మనాథ్ మంగళవారం ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 5న జరగనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ప్రజలకు శాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ సంచులు వాడరాదని సహజ సిద్ధమైన నీటి వనరులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అడవిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం అటవీశాఖ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎస్‌సి గంగాధరం, ఏఈలు నరేష్, అనిల్ రెడ్డి, విఆర్ఒ వెంకటరమణ, నాయకులు మూలె సుబ్బారెడ్డి, కల్లూరి కృష్ణారెడ్డి, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వామా పీడీ తనిఖీలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

మహాత్మా గాంధీ ఉపాధి కూలీల నుండి నగదు వసూలుపై జిల్లా అడిషనల్ డ్వామా పీడీ ఎ.నిర్మలాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన రికార్డుల నమోదులో సిబ్బంది నిర్లక్ష్యం తీరుపై ఆమె మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిఎ కె.శ్రీనివాసులు కూలీల వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి మస్టర్లు వేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో వచ్చినట్లు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఆమెకు అర్జీ రూపంలో తమ తమ సమస్యలను తెలియజేశారు. అనంతరం తూర్పు చేన్నంపల్లి, తూర్పు బోయమడుగుల, జడదేవి ఇసుకపల్లి గ్రామాల కూలీలను ఆమె విచారించి నివేదికలను తయారు చేశారు. ఈ నివేదికల బట్టి సంబంధిత వారిపై చర్యలు తప్పక ఉంటాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ శ్రీనివాసులు, టిఎ శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు పాల్గొన్నారు.

సచివాలయంలో ఎంపిడిఒ తనిఖీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సి.శ్రీనివాసులు తెలియజేశారు. మంగళవారం ఆయన బట్టేపాడు సచివాలయంలో తనిఖీ చేసి సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయం సిబ్బందితో ఆయన మాట్లాడుతూ సిబ్బంది తప్పనిసరిగా ప్రభుత్వం ఇచ్చిన యూనిఫారం ధరించి విధులకు హాజరు కావాలని, అర్హులైన అభ్యర్థులకు ప్రభుత్వ పథకాలను అందించాలని కోరారు. ప్రస్తుతం జగనన్నకు చెబుదాం రా.. కార్యక్రమం అమలులో ఉందని కావున పంచాయతీ కార్యదర్శులు అప్రమతంగా ఉండి సంబంధిత సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. తదుపరి గడపగడపకు మన ప్రభుత్వం కేంద్ర రూ.20 లక్షలు మంజూరు కాగా అందులో బట్టేపాడులో 14 లక్షలతో నిర్మించిన పనులను ఎంపిడిఒ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి నరసింహులు, పద్మజ, సంక్షేమ సహాయకులు నవీన, ఇంజినీరింగ్ సహాయకులు ఖాజా మస్తాన్ పాల్గొన్నారు.

22న వికలాంగులకు ఉపకరణాలు

ప్రజాశక్తి-ఉదయగిరి

ఆత్మకూరులో 22వ తేదీన జరిగే వికలాంగుల ఉపకరణాలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోఆప్షన్ గాజుల తాజుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వ శాఖ ఎఎల్ఐ ఎంసిఒ ద్వారా మాజీ పార్లమెంటు సభ్యులు మేకపాటి. రాజమోహన్ రెడ్డి ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం సహకారంతో ఆత్మకూరు ఉదయగిరి నియోజకవర్గంలో విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ చేసేందుకు గుర్తింపు శిబిరాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నారన్నారు. ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఆదాయం ధృవీకరణ సర్టిఫికెట్, సంబంధిత సదరన్ తదితర సర్టిఫికెట్లు తీసుకుని 22 ఉదయం 10.00 గంటల శిబిరానికి చేరుకోవాలన్నారు.

అభివృద్ధికి నోచని కోవూరు నియోజకవర్గం

ప్రజాశక్తి-కొడవలూరు

ఏమి అభివృద్ధి సాధించారని మళ్లీ జగన్ సిఎం కావాలి... ప్రసన్నఅంటూ జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, జిల్లా ఉపాధ్యక్షులు బద్దిపాడు సుధీర్ ఆధ్వర్యంలో నార్త్ రాజుపాలెంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బొమ్మ దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఎమ్మెల్యేగా కొనసాగుతూ నియోజకవర్గ ప్రజలకు ఏమాత్రమూ అభివద్ధి చేయలేదన్నారు. ఇంకా ఎమ్మెల్యేగా కొనసాగడం అవసరమా..? ఇక నియోజకవర్గాన్ని వదిలి వేయాలన్నారు. కోవూరు, బుచ్చి, రాజుపాళెం గ్రామాలకు సెంట్రల్ లైటింగ్ వేయిస్తామని కోట్ల రూపాయలు శాంక్షన్ చేయించుకున్నారన్నారు. బుచ్చి మినహాయి మరి ఏ ప్రాంతంలో కూడా సెంట్రల్ లైటింగ్ వేయించలేక పోయారన్నారు..వేల ఎకరాలు గ్రామస్తులు దగ్గర నుంచి ప్రభుత్వం దగ్గర నుంచి సేకరించిన ఇఫ్కో కిసాన్ సెజ్ గడవు తీరిన తర్వాత పరిశ్రమలు స్థాపించకలేకపోతే, వెనక్కి తీసుకోబోక వాటిని ప్రయివేటు వ్యక్తుల ద్వారా అమ్మకాలు జరుగుతున్నా మిన్నకున్నారు. కోవూరు కలుజు పై బ్రిడ్జి నిర్మాణం ఎపుడు, పైడేరు కాలువ ఆక్రమణలకు గురవుతున్నా పలు పంట కాలువలు పూడిక తీత కై వచ్చిన నిధులు ఏమయ్యాయన్నారు.వందలాది ఉద్యోగాలు కల్పించగలిగి నిరుపయోగంగా షుగర్ ఫ్యాక్టరీని వదిలేశారన్నారు. కోవూరు నియోజకవర్గంలో ఇసుక గుంటలకు, గ్రావెల్ గోతులకు శ్వేత పత్రం విడుదల చేసే ధైర్యం ఉందా విచారణ జరిపి దోషులను శిక్షించగలరా..?ఇన్ని సమస్యలు నియోజకవర్గంలో పెట్టుకొని మా నాయకుని ఎత్తిచూపే అర్హత మీకు ఉందంటారా అని అన్నారు. రాజధాని లేకుండా అప్పులు ఊబిలో రాష్ట్రాన్ని ముంచేసి ఏ వర్గ ప్రజలు కూడా ప్రశాంతంగా బతక లేకుండా చేసిన జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ఎందుకు సీఎం చేయాలి..?ఇక సీఎం అయ్యే అర్హత ఉందా లేదా పరిశీలించుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇక ఆయన చేయలేని పనుల చిట్టా వివరిస్తే సమయం చాలదన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, ఆయన భావాలు ఆయన పనితీరు గురించి మాట్లాడే అర్హతే లేదని తెలిపారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, ఉపాధ్యక్షులు బద్దిపూడి సుదీర్‌తో పాటు కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, సిటీ కార్యదర్శి హేమచంద్ర యాదవ్, షాజహాన్, చిన్న రాజా, ప్రసన్న తదితర జనసైనికులు పాల్గొన్నారు.

గ్లూకోజ్ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి-కావలి

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వడదెబ్బ తగులకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎపిఎస్ ఆర్‌టిసి కావలి డిపో మేనేజర్ ఆర్ శ్రీనివాసులు డ్రైవర్, కండక్టర్లను కోరారు. మంగళవారం బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి, వేసవితాపానికి శక్తిని కోల్పోకుండా ఉండేందుకు గ్లూకోజ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ వారమంతా బస్సు సిబ్బందికి, డ్యూటీకి బయల్దేరే సమయంలోనే ఓఆర్ఎస్ లేదా గ్లూకోజ్ ప్యాకెట్లు అందజేస్తామని పేర్కొన్నారు. అసిస్టెంట్ మేనేజర్ కెవి ఆర్ బాబు, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్ తదితరులున్నారు.

20న ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలో 2023 - 24 విద్యా సంవత్సరానికి ప్రవేశ పరీక్ష 20న 5,6,7,8వ తరగతుల విద్యార్థులకు ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు అలాగే కళాశాలలకు 2.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కేంద్రమైన నెల్లూరులో నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ హెచ్. శారద అన్నపూర్ణ తెలియజేశారు. పరీక్షకు సంబంధించిన అభ్యర్థులు హాల్ టికెట్స్ HTTPS//para.apcfss.in వెబ్‌సైట్‌లో ఉందని తెలిపారు.

జనసేన నేతలకు వైసిపి హితవు

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు శాసనసభ్యులు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని విమర్శించే స్థాయి జనసేన నాయకులకు లేదని సచివాలయాల కన్వీనర్ కవరిగిరి ప్రసాద్ హితవు పలికారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మండల అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నల్లప రెడ్లది చరిత్ర అని, జిల్లాకు తెలుగు గంగను తీసుకొచ్చిన అపర భగీరథుడు కీర్తిశేషులు నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అని కొనియాడారు. కోవూరు నియోజకవర్గంలో మారుమూల ప్రాంతాలకు సైతం, రహదారులు, లింకు రోడ్లు, వాటర్ ట్యాంకులు, వంతెనలు నిర్మించిన ఘనత నల్లపరెడ్లదేనన్నారు. కరోనా సమయంలో, వరదల సమయంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా నిత్యం ప్రజలను ప్రజల మధ్య ఉంటు ఎన్ఎస్ఆర్ ట్రస్ట్ తరపున ఎందరినో ఆదుకున్న మహోన్నత వ్యక్తి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అని తెలిపారు.

పెయిడ్ ఆర్టిస్ట్‌లు జాగ్రత్తగా మాట్లాడాలని లేకపోతే కోవూరు ప్రజలు తగిన విధంగా బుద్ధి చెపుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ జుబేర్, ఎంపీటీసీ సభ్యులు, వేణుగోపాల్, కేతా మల్లికార్జున్, మల్లవరపు చిరంజీవి, పన్నెం సుధాకర్, నెత్రం బాక సాయి, అంజన్ రావు, మస్తాన్, మునేయ్య, వెంకటేశ్వరరావు, సుధీర్ పాల్గొన్నారు.

గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 142 / 2020

1. గునపాటి వంశీకృష్ణారెడ్డి ......వాది

Vs

గునపాటి జనార్ధనరెడ్డి మరియు ఇతరులు ......ప్రతివాదులు

నోటీసు

To

1. D1 గునపాటి జనార్ధన్ రెడ్డి, S/o లేట్ చంద్రారెడ్డి, కొండాయపాలెం గేట్, నెల్లూరు సిటీ.

2. D2 అన్నదానం గాయత్రి, D/o హేమాద్రి, మనుబోలు గ్రామం మరియు మండలం, యస్.పి.యస్.ఆర్. నెల్లూరు జిల్లా.

వాదిపై నెంబరు దావా ఆస్తి విభజన కొరకు మీ మీద దాఖలు చేసియున్నందున, మీకు దావా మరియు ఐ.ఎ.నెం. 386/2020 నోటీసు నిమిత్తం వాయిదా ఉన్నందున మీరు తే.16-06-2023దిన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోనియెడల, మీ వరోక్షమున దావా మరియు పిటిషన్ తీర్మానించబడునని తెలియజేయడమైనది.

ఇట్లు,
పి. భాస్కరరావు
వాది యొక్క అడ్వకేటు, గూడూరు.